# ఉద్యోగం

అడ్డూరపు హనుమంతరావు




నారాయణ నడుస్తున్నాడు ...
తలెత్తుకుని మరీ నడుస్తున్నాడు ...!
బి. ఏ. పాసయిన తరువాత అయిదేళ్ళు. అంటే అయిదురోజుల క్రితందాకా అతను ఎప్పుడూ తలెత్తుకుని నడవలేదు. ... అలాంటివాడు అయిదు రోజుల్నించీ తలెత్తుకుని ఠీవిగా మరీనడుస్తున్నాడు.

కారణం. . యిప్పుడతను ఉద్యోగి! పైగా, ప్రభుత్వోద్యోగి

మొన్న మొన్నటి దాగా యిల్లు ఖాళీ చెయ్యమని గంతులేసిన ఇంటాయన అతని ఉద్యోగం సంగతి తెలియగానే ... దానికేం మందిలెండి. కష్టాలు మనుషులకి రాక మానులకు వస్తాయా మీ డబ్బెక్కడికి పోతుంది ' అని సాంత్వన వచనాలు పలికాడు ఇక పాలు పొయ్యనని కచ్చితంగా చెప్పిన పాలమనిషి గప్ చుప్‌గా పాలుపోసి వెళ్ళిపోయింది. తండ్రిపోయిన దగ్గర్నుంచి అష్టకష్టాలు పడి చదువుకున్నప్పుడు. చదువుపూర్తయి ఉద్యోగాన్వేషణలో విసిగివేసారి యింట్లో వున్ననగానట్రా అమ్ముకు తిన్నప్పుడు. అవీలేక పస్తులున్నప్పుడు ముఖం చూపించని మేనమామ ఆవేళ ప్రొద్దున్న అతని తల్లిని పలకరించడానికి వచ్చాడు.........

చిన్నగా నవ్వుకున్నాడు నారాయణ.

"ఉద్యోగం!" ఎంత మహత్తువుంది వుద్యోగంలో ఉద్యోగస్తుని కదో విధమైన గౌరవం

గుడ్ మార్నింగ్‌సార్' అన్నాడు నారాయణని గుర్తించిన ఆఫీస్ ప్యూన్ సైకిలి మించిదిగి మళ్ళీ ఎక్కి వెళ్ళిపోతూ .. ఒక్కసారి కాలరు సవరించుకుని సాభిప్రాయంగా రిసీవ్ చేసుకున్నాడు నారాయణ ఈ అయిదేళ్ళ అనేక ఆఫీసు గుమ్మాలు ఎక్కిదిగిన నారాయణకి సబార్డినేట్సు విష్ చేసినప్పుడు సుపీరియర్సు ఎలా రిసీవ్ చేసుకోవాలో బాగా అలవడింది. ఇవాళ తనకి అలాంటి గౌరవం!

ఒక్కసారి మేను గగుర్పొడిచిందతనికి.

'ఏమోయ్ నారాయణా ఏమిటి సంగతులు! ఉద్యోగానికి వయ్యావుట! ఏ డిపార్టుమెంటు. ఏమిటికథ?' తండ్రి స్నేహితుడు కుటుంబరావుగారు పలకరించడంతో ఊహాలోకంనుంచి తెప్పరిల్లాడు నారాయణ

'ఆ...ఏదో టెంపరరీ ఉద్యోగం! పైగా . టెంపరరీ ... ఎప్పుడూడతీస్తారో మనకే తెలియదు ..ఏదో కాలక్షేపానికి......' 'ఇంకోటీ టెంపరరీ ఉద్యోగానికి ఎంత టెంపరో!! పెద్ద పెర్మనెంటుద్యోగిలా..' అని నలుగురూ ఎక్కడనిపోతారోనని ఆత్మాభిమానం చంపుకుని ప్రతి టెంపరరీ ఉద్యోగి అనేమాటలే నారాయణనోటినుంచీ వెలువడ్డాయి . ...

ఆ...టెంపరరియా...పాడా! మొదలాగే అంటారు. తర్వాత దానంతటదే పర్మినెంటవుతుంది...బుద్ధిగామాత్రం చేసుకో......"

భర్తకేనాటికి దానంతటదే అవుతుందని సరిపెట్టుకునే ఆశావాది, గవర్నమెంటు భక్తుడు - కుటుంబరావుగారు. అందుకే అయిదేళ్ళయి రిటైరయి, యింకా పింఛను సెటిల్‌కాకపోయినా అదేవస్తుందిలే అని సరిపెట్టుకుని వెనకేసిన పైసంపాదనమీద నిశ్చింతగా కాలంవెళ్ళబుచ్చుతున్నాడు.

కుటుంబరావుగార్ని వొదిలించుకుని కూరల మార్కెట్టులోకి జొరబడ్డాడు నారాయణ

అంతలో ప్రసాదు కనిపించాడు...'పూర్ ఫెలో' అనుకున్నాడు నారాయణ. ప్రసాదుకింకా ఉద్యోగం దొరకలేదుమరి! కాని అతనికి తిండికి గుడ్డకిలోటు లేదు. మొన్నటిదాకా ప్రసాదునితప్పించుకుని తిరిగాడు నారాయణ కాని ఇవాళ! తను ఉద్యోగస్తుడు!!

అందుకే ప్రసాదుని చూడగానే ... 'ఏరా ప్రసాదూ, ఏమిటి సంగతులు? కులాసానా!...'' అన్నాడు.

"ఏదోలేరా! నీకేం? హాయిగా ఉద్యోగస్తుడివై పోయి కూర్చున్నావు." అన్నాడు మామూలుగా ప్రసాదు

కాని అందులో విస్ఫూరం వీలయిన నారాయణ. 'అదేమిట్రా! రేపో మాపో నీకూ వస్తుంది! అలా బెంబేలుపడితే ఎట్లా?' అన్నాడు పెద్ద రికందలా

కూరలు తీసుకుని వెళ్ళిపోతున్న ప్రసాదుని చూసి మరోసారి 'పూర్ ఫెలో...' అనుకున్నాడు కొంచెం గర్వంగా.

తనుకూడా కూరలు తీసుకుని యింటి ముఖం పట్టాడు...

భోజనం పూర్తిచేసి ఆఫీసుకొచ్చేసరికి సరిగ్గా పదిగంటలైంది... ఆ పెండెన్సు రిజిస్టర్లో వంతులు పెట్టే పనిలో మునిగాడు నారాయణ...

పన్నెండు గంటలైంది...

"సార్ అయ్యగారు పిలుస్తున్నారు..."

అన్న ప్యూన్ పిలుపుతో మేనేజరు గదిలో కొచ్చాడు నారాయణ.

ఆ మేనేజరు.. నారాయణ తండ్రి పూర్వాశ్రమంలో మంచి స్నేహితులు. ఆ అభిమానంతోనే నారాయణకుద్యోగం యిచ్చాడాయన. ఆయన్ని చూడ్డంతోనే సాక్షాత్తూ దేవ దేవుణ్ని చూసినట్టుగా ఫీలవుతాడు, నారాయణ. వినయంగా నమస్కరించి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

చూస్తున్న కొత్త ఫైలు మూసి, కళ్ళజోడు బల్లమీద పెట్టి, కళ్ళు రెండు చేతుల్తోటి అద్దుకుని నెరిసిన తల పైకంటా ఒక్కసారి తడుముకుని, ఎదుటికుర్చీ చూపించి.

"కూర్చోవోయ్..." అన్నాడాయన.

"పరవా లేదు .. సార్... చెప్పండి..." అన్నాడు నారాయణ.

"డోంట్ వర్రీ... కమాన్... సిడౌన్..." అన్నారాయన.

ఒక ఆఫీసరు క్లర్కుతో మాట్లాడేటప్పటి అధికారం అనాడు లేదాయన గొంతులో... ఒక స్నేహితుడితో మాట్లాడినట్టే వుంది...

తలవంచుకుని, వినమ్రవదనుడై కుర్చీలో ఒక ప్రక్కగా ఒదిగి కూర్చున్నాడు, నారాయణ.

ఆయన మళ్ళీ కళ్ళజోడు పెట్టుకుని అన్నాడు.

"చూడు మిస్టర్ నారాయణా! నిన్ననే పైనుంచి ఆర్డర్సు వచ్చాయి. పాకిస్తాన్ వార్ డిక్లేర్ చెయ్యటం మూలంగా సర్ప్లస్‌గా యిచ్చిన పోస్టు లేవీ ఫిలప్ చెయ్యవద్దని. నువ్వు పడుతున్న బాధచూసి ధైర్యంగా సర్ప్లస్‌లోవున్న పోస్టయినా ఫిలప్ చేసేశాను. తర్వాత రాటిఫికేషన్‌కి పెట్టవచ్చుని. కాని నేను పనిచెయ్యక మునుపే ఈ ఆర్డర్సు ముంచుకొచ్చాయి.... చేరిన అయిదురోజుల్లోనే నిన్ను 'ఊస్టు' చెయ్యవలసొచ్చినందుకు నిజంగా చాలా విచారిస్తున్నాను... రేపొచ్చి నీకు రావాల్సింది పట్టుకెళ్ళు!... అప్పుడప్పుడొచ్చి కన్పిస్తూ వుండు! ఛాన్సేదయినా వస్తే తప్పకచూస్తాను..."

ఇంకాయన చెప్పేవేవీ నారాయణ చెవిలో పడలేదు—

ఇంటాయన, పాలవాడు, కుటుంబరావుగారు, ప్రసాదు... ఒక్కొక్కరే కళ్ళముందు గిర్రున తిరుగుతున్నారు.

మేనేజరుగారి కొత్తఫైలు కిందపడ్డ పురుగొకటి గిలగిలా కొట్టుకుంటోంది......

★

# నీవూ - నీచుట్టూ ప్రపంచం

[14 వ పేజీ తరువాయి]

చర్యలు కాంగ్రెసు వర్గాల్లో, ముఖ్యంగా సంపన్న వర్గాల్లనూ, గ్రామ పెద్దల్లనూ, ప్రభుత్వ స్థాయిలోనూ బలీయమైన పలుకుబడిగల అగ్ర వర్గాల్లనూ తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమౌతున్నది. ప్రధాని తన ప్రాబల్యాన్ని కాపాడుకోవడానికి, అల్పసంఖ్యాక కులాలవారిని, ముస్లిములనూ, క్రైస్తవులనూ, వెనుకబడిన తరగతులనూ, హరిజనులనూ కావాలని ప్రోత్సహిస్తోందని కాంగ్రెసులో బలంగా ఉన్న సంపన్న వర్గాలవారు, బాహాటంగా అనలేక చాటుగా విమర్శిస్తున్నారు. ప్రధాని నియంతగా వ్యవహరిస్తుందని విమర్శిస్తున్నారు.

రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం మొదలగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను మార్చినపై కాంగ్రెసు సంపన్నవర్గాల్లో తీవ్రమైన అసంతృప్తి ఏర్పడింది. అయినప్పటికీ, ఈరోజున కాంగ్రెసును బాహాటంగా ఎదిరించినా, ఫలితం శూన్యమని వారుభావించి కాంగ్రెసులోనే ఉండి తమ ప్రాబల్యం కాపాడుకోవడానికి నానా అవస్థలూ పడుతున్నారు. ఆర్థికస్తోమత, సంఘంలో ప్రాబల్యం లేని వెనుకబడిన తరగతుల ప్రాధాన్యం పెరగడం, ఈ సంపన్నవర్గాలకు ఏమాత్రంయిష్టంలేదు. సామాజికంగా వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యం పెంచాలనే ప్రజాతంత్ర భావంతో ప్రధాని తలపెట్టిన ఈ విధానాన్ని ఓడించడానికి ఈ వర్గాలు కాంగ్రెసు వాదులుగనే గట్టిగా ప్రయత్నిస్తున్నారు. వెనుకబడిన తరగతులవారిని ఎంపిక చేసిన స్థానాల్లో కాంగ్రెసు ఓడిపోతుందన్న వాతావరణాన్ని ఈ వర్గాలప్పుడే సృష్టిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ జాబితాలో దాదాపు 60 శాతం కొత్తవారికి కాంగ్రెసు టిక్కెట్లు లభించాయి. గతంలో సంపన్నవర్గాల కున్నంత అత్యధిక ప్రాధాన్యత ఈసారి అభ్యర్థుల ఎంపికలో కొంతమేరకు తగ్గిందని చెప్పాలి. ఆశించినంతగా కొన్ని జిల్లాల్లో వెనుకబడిన తరగతులకు తగినంత ప్రాతినిధ్యం లభించలేదు. అయినప్పటికీ కాంగ్రెసు అభ్యర్థుల ఎంపికలో తెచ్చిన ఈ మాత్రం మార్పు ఆహ్వానించదగినదే. ఈ మార్పుతోనే ఆర్థికస్వరూపం, సామాజికస్వరూపం మారిపోతుందనికాదు. కాని ఈపద్ధతి వలన, ప్రజాస్వామికం సంఘంలో ఆర్థికంగానూ, సాంఘికంగానూ బలహీనంగా ఉన్న వర్గాలకు కూడా విస్తరిస్తుంది. ఈ చిన్న మార్పు గ్రామాల్లో సంపన్నవర్గాలకు ఏమాత్రం రుచించడం లేదు. తమ ఆర్థికప్రాబల్యానికీ, సాంఘికప్రాబల్యానికీ ఈ విధానం ఉత్తరోత్తరా ముప్పుం తెస్తుందని ఆ వర్గాలు భావిస్తున్నాయి. ఆ భావనతోనే, సకలవిధాలా తమప్రాబల్యం చెక్కుచెదరకుండా సంరక్షించుకోవడానికి సన్నద్ధమౌతున్నాయి. తమ ప్రతిష్ఠ గంగలో కలిసిపోతున్నట్లు భావిస్తున్నాయి. ఈ మాత్రం ప్రజాస్వామిక విస్తరణను కూడా ఈ వర్గాలు సహించలేకపోతున్నాయి. అంటే ఈ వర్గాలు ప్రజాస్వామిక వ్యవస్థకు ఎంత వ్యతిరేకులో బోధపడుతుంది. ఈ చిన్న మార్పును మింగలేకపోవడంలోనే వీరి నగ్నస్వరూపం బైటపడుతోంది.

లోగడ కన్పించకుండావున్న ఘర్షణ, ఇప్పుడు బాహ్యరూపం ధరించింది. అందువల్లనే, ఎన్నికలు చప్పగా ఉంటాయనుకున్నది, ఉద్రిక్తంగా జరిగేస్థితి ఏర్పడింది. ఒకవిధంగా ఈఎన్నికలు ప్రధాని తలపెట్టిన మార్పులకు అగ్నిపరీక్ష. మొత్తంమీద ప్రధాని ధైర్యంతో ఈ చర్యను తలపెట్టిందని చెప్పవచ్చు. ఎన్నికల ఫలితాలెలావున్నప్పటికీ, ఈ చిన్నమార్పు ప్రభావం ముందుముందు తీవ్రంగానే ఉండి సత్ఫలితాన్నిస్తుందనేది మాత్రం నిస్సందేహం.

రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఫ్యూడల్, మతతత్వశక్తులు గట్టిగా వేళ్లూనుకుని ఉన్నాయి. అక్కడకూడా కాంగ్రెసువర్గాల అసంతృప్తిఉంది ఈ రాష్ట్రాల్లో కాంగ్రెసుకు జనసంఘ్, తదితర ఫ్యూడల్ శక్తులు గట్టిపోటీ యిస్తాయి.

గుజరాత్‌లో పారిశ్రామికాధిపతుల ప్రాబల్యం విపరీతం. అక్కడి కాంగ్రెసులో సంపన్న వర్గాలకే చాల హెచ్చు ప్రాతినిధ్యం లభించింది. ఈ రాష్ట్రంలో శ్రీ మొరార్జి నాయకత్వాన సిండికేట్ యింకా బలంగానే వుంది. అందువలన సిండికేట్‌కూ, కాంగ్రెసుకూ గట్టిపోటీ ఉంటుంది.

యింకా మహారాష్ట్రలో కూడా చాల మంది కొత్తవారికే కాంగ్రెసు టిక్కెట్లు దక్కాయి.

కాంగ్రెసులో శ్రీమతి గాంధి తలపెట్టిన మార్పుల వలన ఆవర్గాల్లో చెలరేగిన అసంతృప్తి తమకు బాగా ఉపయోగపడుతుందని ప్రతిపక్షాలాసిస్తున్నాయి. భూసంస్కరణలు కాంగ్రెసు ప్రభుత్వాలు చేయలేదనీ, పెనుభూతంలా పెరుగుతున్న నిరుద్యోగాన్ని పరిష్కరించలేదనీ, ధరలు పెరుగుదలను అరికట్టలేకపోయాయని, అవినీతి ప్రభుత్వ యంత్రాంగంలో పేరుకుపోయిందన్న అంశాలు వామపక్ష ప్రతిపక్షాలకు అనుకూలమైన అంశాలు. కాంగ్రెసు ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తున్నదనే అంశం ప్రగతినిరోధక ప్రతిపక్షాలకు అనుకూలమైన అంశాలు.

కాంగ్రెసులో ఏర్పడిన అసంతృప్తి ఏ రూపం ధరిస్తుందీ, ఏ మేరకు ప్రతిపక్షాలకు లాభం చేకూరుతుందీ అప్పుడే చెప్పడం కష్టం.

ప్రతిపక్షాలకూ, ఇండిపెండెంటుగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు మరో ఆశకూడ ఉంది. మధ్యంతర పార్లమెంటు ఎన్నికలలో వ్యక్తమైనంత "ఇందిరా గాలి" ఇప్పుడు లేదని ఆశ పడుతున్నారు. మొత్తంమీద ప్రజలనాడి ఏ విధంగా వున్నదో యింకా ఎవరికీ అంతు చిక్కడంలేదు. కాంగ్రెసువారు తాము సులువుగా నెగ్గగలమని ఆశించడం సహజం.

ఏమైనప్పటికీ, మొత్తంమీద రాష్ట్రాల్లోఎన్నికలు చాలా ఆసక్తిదాయకంగా ఉంటాయి.

★